సాక్షి
పెద్దపల్లి
సోమవారం ၊ 9 ၊ డిసెంబర్ ၊ 2024



మల్లన్నకు మొక్కులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కోనేరులో స్నానాలు ఆచరించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఖండేలరాయుడు, సీతారామచంద్రస్వామి, భక్తాంజనేయస్వామి, నందీశ్వరులను దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి, బోనాలతో నైవేద్యం సమర్పించారు.

న్యూస్‌రీల్

మల్లికార్జునస్వామి శోభాయాత్ర



కమాన్‌పూర్(మంథని): జూలపల్లి గ్రామంలో ఆదివారం శ్రీపర్వతాల మల్లికార్జునస్వామి శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహ ప్రతిమలను పల్లకీలో ఊరేగించారు. ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాలు, మహిళల కోలాటాలతో స్వామి వారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామ శివారులోని ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆలయ నిర్వాహకులు, ఎలబోయిన వంశీయులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సదస్సులో 'సిమ్స్' మెడికోల ప్రతిభ



కోల్‌సిటీ(రామగుండం): చండీగఢ్‌లో ఈనెల 4 – 7వ తేదీ వరకు నిర్వహించిన 50వ జాతీయ బయోకెమిస్ట్రీ సదస్సులో సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) కాలేజీకి సెకండియర్ మెడికోలు ప్రతిభ చాటారు. బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ వర్ధన్ ఆధ్వర్యంలో సల్వాజి రిషిరావు, హర్షవర్ధన్, సాత్విక్, అభిరామ్, సుదీప్, సృజన, అనూష, అన్ను న్యూరో బయోకెమిస్ట్రీ విటమిన్–డి, హెవీ మెంటల్ టాక్సిసిటీపై చేసిన పరిశోధనలను సదస్సులో ప్రదర్శించారు. వీరి ప్రదర్శనను వీక్షించిన జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, నిపుణులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటడం కళాశాలకు గర్వకారణమని, ఇందుకు కృషి చేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ వర్ధన్‌ను సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ప్రొఫెసర్లు తదితరులు అభినందించారు.

సీఎంను కలిసిన అవినాష్



పెద్దపల్లిరూరల్: ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా గెలిచిన బొంకూరి అవినాష్ ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం ఆయనకు సూచించారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవినాష్ కృతజ్ఞతలు తెలిపారు.

మిఠాయిలు పంపిణీ



జూలపల్లి(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ, న్యూజిలాండ్‌లో నివాసం ఉంటున్న పద్మశాలీ నాయకుడు కోడూరి చంద్రశేఖర్ అక్కడ నిర్వహించిన ఎన్నికల్లో తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికపై బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సంపత్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాల ఐక్య వేదిక నాయకుడు మానుమండ్ల శ్రీనివాస్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మేరుగు రమేష్, నాయకులు ముమ్మాడి రవి, సతీశ్‌సింగ్, వేణు, అజయ్, తోట కుమార్, వెంకటేష్, వోల్లాజీ శ్రీనివాస్, ముత్యాల కొమురయ్య, ప్రేమ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

రామగిరి(పెద్దపల్లి): తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో స్థానిక సెంటినరీకాలనీ జేఎన్టీయూలో ఆదివారం డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 140 మందికి 101 మంది అభ్యర్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 140 మందికి 112 మంది హాజరయ్యారని వివరించారు. రామగిరి ఎంపీడీవో శైలజారాణి ఆధ్వర్యంలో పన్నూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది పరీక్ష కేంద్రం ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధికి పురస్కారం



కిరాణం.. చికెన్ సెంటర్ నిర్వహణలో మహిళ

- ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా మహిళా సంఘాల కార్యకలాపాలు
- ఫ్రెండ్లీ ఉమెన్ విభాగంలో అవార్డు
- జాతీయస్థాయిలో పురస్కారం రావడంపై చిల్లపల్లివాసుల ఆనందం

మంథని: చిల్లపల్లి గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో మెరిసింది. ఆ గ్రామ మహిళల ఐక్యతకు చిరునామాగా నిలిచింది. అనేక మంది పేదమహిళలు స్వయం ఉపాధి ద్వారా వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నాయి. అనతికాలంలోనే ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబాలకు బాసటగా, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలోనే ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ కింద జాతీయ స్థాయి అవార్డుకు కేంద్రప్రభుత్వం ఎంపిక చేయడంపై మహిళలు, గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

స్వయం ఉపాధితో అగ్రగామిగా..

మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధి ఎంచుకుంటున్నారు. వీరు ఆర్థికాభివృద్ధి సాధించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రోత్సహిస్తోంది. తద్వారా మహిళలు తీసుకున్న రుణాల్లో వందశాతం సద్వినియోగం చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో 33 స్వశక్తి సంఘాలు ఉడగా 335 మంది సభ్యులు ఉన్నారు. వీరు ఇప్పటి వరకు రూ.3.35 కోట్ల వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. రుణవాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించడమే కాకుండా పొదుపు ఖాతాల్లో సైతం జమ చేస్తున్నారు. ఇక్కడి సంఘాల్లో రూ.4.45 లక్షలు పొదుపు చేసుకున్నారు. అలాగే స్త్రీనిధి ద్వారా 79 సంఘాలు రూ.34 లక్షలు రుణం పొంది స్వయం ఉపాధి పొందుతున్నారు.

వ్యాపారాభివృద్ధి..

బ్యాంకుల నుంచి పొందిన రుణం ద్వారా మహిళలు అనేక వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఇందులో ప్రధానంగా టైలరింగ్, బ్యూటీపార్లర్, జనరల్ స్టోర్స్, కంగన్‌హాల్స్, పాడి గేదెలు, మినీ ఏటీఎం, ప్యాడీ సెంటర్ల నిర్వహణ.. ఇలా వ్యాపారాలు ప్రారంభించారు.

సంక్షేమ పథకాల అమలులో కీలకం..

గ్రామంలోని మహిళా సంఘాలన్నీ గ్రామ సంఘంగా ఏర్పడ్డారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూరేలా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు బాధ్యతలు అప్పగించగా.. ఆ పనులు పూర్తిచేసి మంచి పేరు సాధించుకున్నారు. ఇలా గ్రామంలో మహిళలు ఐక్యతను చాటి ఆదర్శంగా నిలిచారు.



నెలకు రూ.15వేల ఆదాయం

స్వశక్తి సంఘం నుంచి రుణం పొందిన. ఫికో, కుట్టు మిషన్ కొనుగోలు చేసిన. వీటిద్వారా నెలకు రూ.15 వేల వరకు ఆదాయం వస్తంది. రెండేళ్లలో సమకూరిన ఆదాయంతో సొంతంగా ఇల్లు కట్టుకున్నం. చీరలు, ఫాల్స్ విక్రయిస్తూ ఇంకో కుట్టు మిషన్ కొనుగోలు చేసిన. మరికొందరికి కుట్టు మిషన్‌పై శిక్షణ ఇస్తున్న.

– రామిళ్ల మల్లేశ్వరి, దర్జీ



బ్యూటీపార్లర్‌తో ఉపాధి

మహిళా సంఘం నుంచి రూ.లక్ష లోన్ తీసుకుని బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసిన. వివాహాలు, శుభకార్యాల సందర్భంగా ఆదాయం బాగానే వస్తంది. దీంతో రెండు కుట్టుమిషన్లు కొనుగోలు చేసిన. నెలకు రూ.8 వేల – రూ.10 వేలు వస్తంది. మా ఆయన ఆదాయానికి నా సంపాదన తోడవడంతో ఇబ్బందుల్లేకుండా ఉంది.

– కటుకూరి కృష్ణవేణి, బ్యూటీపార్లర్ యజమాని

సంతోషంగా ఉంది



అనేక మహిళా సంఘాలకు రుణాలు ఇప్పిస్తున్నాం. చిల్లపల్లి గ్రామానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడం సంతోషాన్నిచ్చింది. మహిళలు ఐక్యతకు మారుపేరుగా నిలిచారు. నెలకు రెండు సమావేశాలు నిర్వహించి వివిధ అంశాలపై చర్చిస్తారు. వాటికి నన్ను ఆహ్వానిస్తారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడం సంతోషంగా ఉంది.

– సంతోషం పద్మ, డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్, మంథని

పల్లెకు హైస్పీడ్ నెట్



టీ ఫైబర్ సేవల ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, తదితరులు

- ఇంటింటికీ నాణ్యమైన ఇంటర్నెట్ సౌకర్యం
- పైలెట్ ప్రాజెక్టుగా అడవిశ్రీరాంపూర్ ఎంపిక
- టీ ఫైబర్ సేవలు ప్రారంభించిన మంత్రి

ముత్తారం(మంథని): నగరాలు, పట్టణాలతో సమానంగా పల్లెల్లోనూ నాణ్యమైన, హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తేవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు టీ ఫైబర్ సేవలను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వర్చువల్ విధానంలో ఆదివారం ప్రారంభించారు. దీంతో అడవిశ్రీరాంపూర్‌వాసులకు నాణ్యమైన, వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. తొలుత ఇంటింటా మూడు నెలలపాటు ఉచితంగా ఇంటర్నెట్ సేవలు అందిస్తారు.

పైలెట్ ప్రాజెక్టులుగా మూడు గ్రామాలు..

సంగారెడ్డి జిల్లా ఆంధోల్ మండలం సంగుపేట, నారాయణపేట జిల్లా మద్దూరు, పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేశారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం వర్చువల్ పద్ధతిన టీ ఫైబర్ సేవలు ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఈ దృశ్యాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పలువురు అధికారులు తదితరులు వీక్షించారు. హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావడంతో గ్రామస్తుల్లో సందడి నెలకొంది.

తొలుత తొమ్మిది ఇళ్లకు..

పయనీర్ ఈ ల్యాబ్స్ కంపెనీ ఆధ్వర్యంలో టీపీవోసీ(ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్)లో భాగంగా అడవిశ్రీరాంపూర్‌లో హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభించారు. టీ ఫైబర్, పయనీర్ ఈ ల్యాబ్స్ కంపెనీ భాగస్వామ్యంతో ప్రభుత్వం ఇంటింటా క్వాలిటీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తోంది. ఈ గ్రామ జనాభా సుమారు 5వేలకుపైగా ఉంటుంది. 1,108 కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతం గ్రామంలో తొమ్మిది ఇళ్లకు టీ ఫైబర్ కేబుల్ కనెక్షన్ ఇచ్చారు.

టీ ఫైబర్ సేవలు ఇలా..

- 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో అన్‌లిమిటెడ్.
- ఇంటర్నెట్, ఐపీటీవీ, మొబైల్ ఫోన్‌నెట్
- సెట్‌ఆఫ్ బాక్స్‌తో టీవీని కంప్యూటర్‌లా వినియోగించే సౌకర్యం
- ప్రభుత్వ అప్లికేషన్ల సదుపాయం(పౌరసేవలు)
- గ్యాస్, కరెంట్ తదితర బిల్లుల చెల్లింపు
- టీ ఫైబర్ ద్వారా తక్కువ ధరకే క్వాలిటీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం
- విద్యార్థుల విద్య, ఉద్యోగ సాధనకు ఆన్‌లైన్ క్లాసులు
- గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవకాశం.

ఖర్చు ఆదా అయితంది



నేను బీటెక్ పూర్తి చేసిన. ఏడాదిన్నరగా నాన్ ఐటీలో రోజూ ఐదు గంటల పాటు ల్యాప్‌టాప్‌పై వర్క్ చేస్తున్న. మా ఊరులో నెట్ సౌకర్యం లేదు. నెలకు రూ.1,000పైగా మొబైల్‌లో రిచార్జ్ చేసుకునేవాడి. ఆర్థికంగా ఇబ్బందిగా ఉండేది. టీ ఫైబర్‌తో హైస్పీడ్ నెట్ వస్తోంది. ఖర్చు కూడా ఆదా అవుతంది.

– అపరాధి రాకేశ్, సాఫ్ట్‌వేర్, గ్రామస్తుడు

నెలరోజుల్లో ఇంటింటికీ కనెక్షన్



నెలరోజుల్లోగా అడవి శ్రీరాంపూర్‌లో ఇంటింటా ఇంటర్నెట్ కనెక్షన్లు అందిస్తాం. ఇందుకోసం ఏర్పాటు చేసే సెట్ ఆఫ్ బాక్స్ మల్టిపుల్ ఆప్షన్‌గా పనిచేస్తుంది. కంప్యూటర్ లేకున్నా టీవీని కూడా కంప్యూటర్‌లా ఉపయోగించవచ్చు.

– వర్ధినేని పవిత్రన్, టెక్నాలజీ హెడ్, పయనీర్ ఈ ల్యాబ్స్

ఆనందంగా ఉంది



వరంగల్‌లో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న. సెలవుల్లో ఇంటికి వచ్చిపోతూ ఉంట. నెట్ లేక ఇబ్బంది ఉండేది. ఇప్పుడు టీ ఫైబర్ కనెక్షన్ ఇవ్వడం ఆనందంగా ఉంది. దీంతో మా టీవీకి కనెక్షన్ ఇచ్చినం. ఉద్యోగాల కోసం రెజ్యూమ్, అప్లికేషన్ డౌన్‌లోడ్, కాంపిటీషన్ ఎగ్జామ్ ప్రిపరేషన్, మెయిల్స్ తదితర సేవలు అందుబాటులోకి వచ్చినయి. మా ఊరులో పండుగ వాతావారణం ఏర్పడింది.

– నిమ్మతి సౌమ్య, విద్యార్థిని

ప్రతీ గ్రామానికి నెట్ సేవలు



తక్కువ చార్జీకే పల్లెల్లో క్వాలిటీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. టీ ఫైబర్‌తో టీవీ, కంప్యూటర్, మొబైల్ ఫోన్ సేవలు పొందేవీలుంది. రాష్ట్రంలో మూడు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశాం. అందులో మంథని నియోజకవర్గంలో అడవిశ్రీరాంపూర్ ఉంది.

– శ్రీధర్‌బాబు, ఐటీ మంత్రి

అభివృద్ధి పనులే ఆరోపణలకు సమాధానం

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/కోల్‌సిటీ(రామగుండం): నియోజకవర్గంలో తాము చేపట్టే అభివృద్ధి పనులే ప్రతిపక్షాల ఆరోపణలకు సమాధానమిస్తాయని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ఇందిరానగర్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.3.76 కోట్ల వ్యయంతో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన 900 మీటర్ల పొడవైన మేజర్ నాలా పనులను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. అప్పటి పాలకులు 25ఏళ్లుగా చేయలేని పనులను తాము గెలిచిన ఆర్నెల్లలోనే చేసి చూపించామన్నారు. నియోజకవర్గంలో మార్పు మొదలైందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు లేక చెత్తాచెదారం కూరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, దీనితో ప్రజలు ఇబ్బందికి గురయ్యేవారని తెలిపారు. రోడ్ల విస్తరణ, లైటింగ్, కమర్షియల్ కాంప్లెక్స్, అభివృద్ధి, సంక్షేమ పనుల కోసం రూ.500కోట్లు మంజూరు కాగా రూ.280కోట్లతో పనులు ప్రారంభమైయ్యాయని వివరించారు. నాయకులు మహంకాళి స్వామి, రాజిరెడ్డి, ముస్తాఫా, శ్రీనివాస్ ఉన్నారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దుతాం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పలు వార్డుల్లో రూ.1.32 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రమైన పెద్దపల్లిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. ఇంటింటికీ తాగునీటి సరఫరా చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుభాష్‌రావు, సంపత్, నాయకులు మస్రత్, రంగయ్య, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్' రిస్క్ కేసులు



ఆరో తరగతి చదివే ఈ బాలిక పేరు ఉడుత వైష్ణవి. మంథని మండలం నాగారం. తల్లిదండ్రులు మహేశ్వరి – సంతోష్, వ్యవసాయ కూలీలు. గత ఆగస్టు 24న అరుగుపై నిద్రిస్తున్న వైష్ణవిని పాము కాటేసింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. వెంటిలేటర్‌పై ఉన్న తమ కూతురు ఇక బతకదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పిల్లల వైద్య నిపుణులు ఆదిశ్‌రెడ్డి, రాజీవ్, ఎ.శిరీష, కె.శిరీష కేసును సవాల్‌గా తీసుకుని వైద్య చికిత్స ప్రారంభించారు. గంట గంటకూ బాలిక ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షిస్తూ రెండు రోజులపాటు రాత్రింబవళ్లు శ్రమించారు. వారి శ్రమకు ఫలితం దక్కింది. మూడు రోజుల తర్వాత పాప ఆరోగ్యం కుదుటపడింది. తల్లిదండ్రులేకాదు.. డాక్టర్లు సైతం ఊపిరి పీల్చుకున్నారు.



రామగుండం మసీదు ప్రాంతానికి చెందిన సయ్యద్ ఐమాన్(31 నెలలు) ఈఏడాది అక్టోబరు 30న ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. తలపై చర్మం ఊడిపోయింది. రక్తం మడుగులో కొట్టుకుంటున్న బాలుడిని తండ్రి సయ్యద్ అమీర్‌పాషా వెంటనే గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సకాలంలో స్పందించిన వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు.

- క్లిష్ట సమస్యలను సవాల్‌గా స్వీకరిస్తున్న వైద్యులు
- అత్యాధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు, ఆధునిక వైద్య సేవలు
- జీజీహెచ్‌లో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం
- గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఘనత



గత అక్టోబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గోదావరిఖనికి చెందిన జంగ సంజయ్ ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. జీజీహెచ్‌లో అడ్మిట్ కావడంతో అనెస్తీషియా సాయంతో వైద్యులు రంగంలోకి దిగారు. అత్యంత కఠినమైన, ఆధునిక పద్ధతిన శస్త్రచికిత్స చేయడంతో బాధితుడు కోలుకున్నాడు. ఇలాంటి ఆర్బిటాల్ ఏస్ఫోరేషన్ – ఆర్బిటాల్ ఫ్రాక్చర్ శస్త్రచికిత్సలు ఇప్పటివరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలోనే చేస్తున్నారు. తొలిసారి గోదావరిఖని గవర్నమెంట్ జనరల్(జీజీహెచ్) ఆస్పత్రిలో నిర్వహించడం విశేషం.



మోకీలు మార్పిడి సర్జరీ విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) కాలేజీకి అనుబంధంగా స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని బోధనాస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన వసతులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అత్యంత క్లిష్టమైన వైద్యచికిత్సలు, శస్త్రచికిత్సలు చేయడంలో డాక్టర్లు ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. వివిధ కారణాలతో ప్రాణాపాయంలో కొట్టుమిట్టాడుతున్న పేషెంట్లకూ వైద్యం చేస్తూ పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించినా అందని వైద్యసేవలు జీజీహెచ్‌లో ఉచితంగానే అందుబాటులోకి రావడం, వైద్యులు కూడా ఎంతోసహనం, ఓర్పుతో సేవలు అందించడంతో పేదల్లో సర్కారు వైద్యంపై భరోసా పెరుగుతోంది.

ఒరోఫేషియల్ సర్జరీ విజయవంతం

ప్రమాదానికి గురైన ఓ పేషెంట్‌కు జీజీహెచ్ వైద్యులు తొలిసారి మారథాన్ ఒరోఫేషియల్ ట్రామా సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో ముఖంపై ఆరుచోట్ల పగిలిన ఓ పేషెంట్‌కు హైబీపీ ఉన్నా వైద్యులు రిస్క్ తీసుకుని శస్త్రచికిత్స చేశారు. ఆరుచోట్ల మినీప్లేట్ ఇంప్లాంట్లు, మరో 20 స్క్రూల ప్లేస్‌మెంట్‌తో పగుళ్లను చక్కదిద్దారు.

మోకీలు మార్పిడి సేవలు..

జీజీహెచ్‌లో ఆర్థోశస్త్ర చికిత్సలు మెరుగ్గ అందుతున్నాయి. ఇందులో ప్రధానంగా మోకీలు మార్పిడి ఆపరేషన్లు సక్సెస్ కావడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టులో వృద్ధురాలు రామిండ్ల లింగమ్మకు మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేయడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

నా కొడుకును బతికించారు



నా కొడుకుపై కుక్కలు దాడిచేయడంతో తలపై చర్మం ఊడిపోయింది. పరిస్థితి చూసి బతకడు కున్న. జీజీహెచ్ డాక్టర్లు దేవుళ్లు. కేసును చాలెంజ్‌గా తీసుకొని ఆపరేషన్ చేసి బతికించారు.

– సయ్యద్ అమీర్‌పాషా, రామగుండం


మా వైద్యుల కృషి బాగుంది



పీడియాట్రిషిన్ టీం సాయంతో చాలా రిస్క్ కేసులను చాలెంజ్‌గా తీసుకొని శిశువులకు వైద్యసేవలు అందిస్తూ బతికిస్తున్నాం. 600 గ్రాముల బరువున్న ఓ శిశువు బతికే అవకాశం లేకున్నా.. మా బృందం సాయంతో బతికించాం. కొన ఊపిరితో ఉన్న మరో శిశువును మూడురోజులు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేయి ప్రాణాలు పోశాం.

– ఆదిశ్‌రెడ్డి, పిల్లల వైద్య నిపుణుడు–జీజీహెచ్

క్లిష్టమైన కేసులకూ సేవలు



జీజీహెచ్ సూపరింటెండెంట్, సిమ్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రోత్సాహంతో తుంటి ఎముకలు, మోకీలు మార్పిడి తదితర శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్

క్లుప్తంగా

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ భర్త మృతి


గణేశ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ భర్త జవ్వాజి గణేశ్(48) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గణేశ్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. శనివారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. కాగా, మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు.

గుండెపోటుతో బుగ్గారం ఎంపీడీవో..


శ్రీనివాస్ (ఫైల్)

బుగ్గారం(ధర్మపురి): జగిత్యాల జిల్లా బుగ్గారం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మాడిశెట్టి శ్రీనివాస్(60) గుండెపోటుతో మృతిచెందారు. శనివారం ఎప్పటిలాగే విధులకు హాజరై అనంతరం కరీంనగర్‌లోని తన నివాసానికి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో ఛాతీలో నొప్పి ఉందని కుటుంబ సభ్యులకు తెలుపగానే వారు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నట్లు తోటి ఉద్యోగులు పేర్కొన్నారు. కాగా, గుండెపోటుతో అకాల మరణం చెందిన ఎంపీడీవో శ్రీనివాస్‌ను కడసారి చూసేందుకు మండలానికి చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు కరీంనగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బుగ్గారం మాజీ జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, నాయకులు వేముల సుభాష్, నగునూరి నర్సాగౌడ్, నగునూరి రాజశేఖర్, సమీద్, జంగ శ్రీనివాస్, ఎంపీవో అఫ్జల్‌మియా, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మహమ్మద్ షమీమ్(ఫైల్)

సిరిసిల్లక్రైం: తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షమీమ్ (46) అప్పుల బాధ భరించలేక ఆదివారం సిరిసిల్ల మానేరు వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాలు.. మహమ్మద్ షమీమ్ కుటుంబ పోషణ నిమిత్తం టైలరింగ్ పని చేసేవాడు. ఇటీవల తన పెద్ద కుమార్తె వివాహం చేయగా అప్పులయ్యాయి. చిన్న కూతురు వివాహం ఎలా చేయాలనే దిగులుతో పాటు ఇప్పటికీ చేసిన అప్పులు పెరగడంతో అవి తీర్చే దారిలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కౌసర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ పోలీసులు తెలిపారు.





తరలివచ్చి.. మొక్కులు చెల్లించి

వేములవాడ: రాజన్నను ఆదివారం సుమారు 35 వేల మంది దర్శించుకున్నారు. సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

విద్యానగర్(కరీంనగర్): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కరీంనగర్ జిల్లా శాఖ ఎన్నికలు ఈనెల 11న జరగనున్న నేపథ్యంలో ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ ఎన్నికల్లో వివిధ పదవులకు పోటీ చేసేందుకు 99 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష స్థానానికి ఏడుగురు, కార్యదర్శి స్థానానికి ఏడుగురు, 3 ఉపాధ్యక్ష స్థానాలకు 17 మంది, 3 సహాయ కార్యదర్శి స్థానాలకు 18 మంది, కోశాధికారి స్థానానికి ఐదుగురు, జిల్లా కార్యవర్గ సభ్యులు 16 స్థానాలకు 45 నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బుర్ర సంపత్‌కుమార్ మాట్లాడుతూ, నామినేషన్ల పర్వం ముగిసిందని, 9న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించినట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికకు సంబంధించి అన్ని పదవులకు ఏకగ్రీవం కాకుంటే 11న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎల్‌ఎండీలోని శ్రీతాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఫంక్షన్ హాల్‌లో పోలింగ్ నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు, జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్ నగునూరి శేఖర్ పర్యవేక్షించగా, ఎన్నికల సహాయ అధికారులుగా ఎలగందుల రవీందర్, దూలూరి జగన్మోహన్ వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి పరీక్షల పరిశీలకుడిగా ఓదెలు కుమార్


ఓదెలు కుమార్

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యార్థి విజ్ఞాన్ మంథన్ టాలెంట్ టెస్ట్ పరీక్షల రాష్ట్రస్థాయి పరిశీలకుడిగా ఓదెలు కుమార్ ఎంపికయ్యారు. గత నెల 23, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంథన్ టాలెంట్ పరీక్షకు రాష్ట్రంలోని 128 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 25న నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, ఘట్ కేసర్ హైదరాబాద్‌లో ప్రయోగ పరీక్షలు నిర్వహించి 10 మంది విద్యార్థులను జాతీయస్థాయికి ఎంపిక చేయనున్నారు. ప్రయోగ పరీక్షకు పరిశీలకుడిగా చిగురుమామిడి మండలం, ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బి.ఓదెలు కుమార్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా అతడిని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్ రావు, డీసీఈబీ కార్యదర్శి స్వదేశ్‌కుమార్, అశోక్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.జయప్రద, ఉపాధ్యాయులు అభినందించారు.

కొడుకును కాపాడబోయి తండ్రి మృతి

- విద్యుదాఘాతంతో దుర్మరణం


రాజమౌళి (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): విద్యుత్ షాక్‌కు గురైన కొడుకును కాపాడబోయి తండ్రి మృతిచెందిన ఘటన వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పిట్టల రాజమౌళి (37) ఆటో నడుపుకుంటూ జీవిస్తాడు. అతడి నాన్నమ్మ మూడురోజుల క్రితం మృతిచెందింది. ఆదివారం మూడురోజుల కార్యక్రమం నిర్వహించి కుటుంబ సభ్యులందరూ స్నానాల కోసం దగ్గర లోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అక్కడ స్నానాలు చేస్తుండగా రాజమౌళి కొడుకు రిశ్వంత్‌కు కరెంట్ మోటార్ పైప్ ద్వారా ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కొడుకును కాపాడబోయి రాజమౌళి షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మోటార్ ఫ్యూజులు తీసివేసి తీవ్రగాయాలపాలైన తండ్రి కొడుకులను కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే రాజమౌళి మృతిచెందినట్లు తెలిపారు. రిశ్వంత్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బస్టాండ్‌లో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది 108 ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలుపడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

- 60 శాతం కాలిన గాయాలతో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తి


విద్యుత్ టవర్‌పై తిరుపతి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన రేగుల తిరుపతి రైల్వేట్రాక్‌పై హైటెన్షన్ విద్యుత్ తీగ పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఎన్టీపీసీ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సాజన్ అనే యువతి ఉపాధి కోసం గోదావరిఖని ప్రాంతానికి వలస వచ్చింది. గోదావరిఖనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రేగుల తిరుపతికి ఆమె పరిచయమైంది. వీరిద్దరూ 2008లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే, మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. దీంతో తిరుపతి అప్పట్లో రెండుసార్లు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఎన్టీపీసీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. భార్యాభర్తలను పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అయినా, ఎవరిలోనూ మార్పురాలేదు. ఈక్రమంలో ఆదివారం ఇద్దరూ గొడవపడ్డారు. మనస్తాపం చెందిన తిరుపతి సమీపంలోని రైల్వేట్రాక్ వద్దకు వెళ్లాడు. అక్కడి టవర్ ఎక్కి విద్యుత్ తీగను చేతులతో పట్టుకున్నాడు. హైటెన్షన్ విద్యుత్ కావడంతో ఒక్కసారిగా మంటలు లేచి ఫ్యూజ్ కొట్టేసి సరఫరా నిలిచిపోయింది. ఈప్రమాదంలో తిరుపతి శరీరం సుమారు 60శాతం వరకు కాలిపోయింది. టవర్ మధ్య కాసారంలో తల ఇరుక్కుని విలవిల్లాడుతుండగా.. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని తిరుపతిని కిందకు దించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. పరిస్థితి విషమంగా ఉందని చెప్పి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం బాధితుడు కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఎస్సై ఉదయ్ కిరణ్ ఘటనపై విచారణ చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఆయుధాలు

- యువత చేతుల్లోకి మారణాయుధాలు
- పెళ్లి బరాత్‌లు, బర్త్‌డే వేడుకల్లో హంగామా

'పది రోజుల క్రితం జగిత్యాల జిల్లా సరిహద్దు గ్రామంలో ఓ యువకుడు మద్యం మత్తులో తల్వార్ పట్టుకుని హంగామా సృష్టించగా గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు పెట్టారు'.

'జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని గోదావరినది సమీపంలో ఓ యువకుడు జన్మదిన వేడుకల్లో ఆయుధంతో కేక్ కట్‌చేసిన వీడియో ఇటీవల వైరల్‌గా మారింది'.


ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టిన ఆయుధం

జగిత్యాలక్రైం: యువకులు తమ భవిష్యత్‌ను ఎంచుకునే వయస్సులో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆయుధాలు కొనుగోలు చేస్తూ హంగామా సృష్టిస్తున్నారు. చాలా మంది యువకులు మద్యం మత్తులో గొడవలకు పాల్పడి కక్షలు పెంచుకుని ప్రత్యర్థులపై దాడులు చేసేందుకు గుట్టు చప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో ఆయుధాలు తెప్పించుకుని వెంట పెట్టుకుని తిరుగుతున్నారు. మద్యం మత్తులో ఉన్న సమయంలో జనసంచారం ఉన్న చోట ఆయుధాన్ని తీసి హంగామా సృష్టించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిఘా కరువు

ఏడాది కాలంగా జగిత్యాల జిల్లాలో చాలా మంది యువకులు ఆన్‌లైన్ ద్వారా తమకు అవసరమైన వస్తువులు తెప్పించుకోవడంతోపాటు గుట్టుచప్పుడు కాకుండా మారణాయుధాలను కూడా కొనుగోలు చేస్తున్నారు. వీటిపై నిఘా కరువవడంతో ఇష్టారీతిన తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆయుధాలను కుటుంబ సభ్యులకు తెలియకుండా రహస్య ప్రాంతంలో దాచిపెడుతూ, గొడవల సమయంలో వాటిని బయటకు తీస్తుండడం ఆందోళనకర పరిణామం.

బర్త్ డేలు, పెళ్లి వేడుకల్లో..

జిల్లాలో చాలా మంది యువకులు బర్త్ డే, పెళ్లి వేడుకల్లో మారణాయుధాలతో డ్యాన్స్‌లు చేయడంతో పాటు తల్వార్‌లు తిప్పుతూ హంగామా సృష్టించిన ఘటనలు ఉన్నాయి. కొంత మంది యువకులు ఆన్‌లైన్ ద్వారా డమ్మీ తుపాకులు, తల్వార్‌లు, కత్తులు, కీచైన్ రూపంలో ఉన్న మారణాయుధాలు ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్ గద్దె కూల్చివేత


ధ్వంసమైన బీఆర్‌ఎస్ గద్దె

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌లో బీఆర్‌ఎస్ గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఈ ఘటనపై ఆపార్టీ మండల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దె కూల్చినవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజేశ్వర్‌రావునగర్‌లో బీఆర్‌ఎస్ గద్దె నిర్మించి దానిపై కారును సింబల్‌గా పెట్టారు. ఇటీవల ఓ అధికారి గద్దెపై ఉన్న కారును తొలగించాలని చెబితే తాము క్రమశిక్షణ గల కార్యకర్తలుగా కారును తొలగించామని చెప్పారు. కానీ ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు గద్దెను కూల్చివేశారని ఆగ్రహించారు. దీని వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, నాయకులు కమ్మరి రాజారాం, పిట్ల బాబు, కొమిరిశెట్టి లక్ష్మణ్, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ క్వార్టర్స్‌కు సీనియర్స్ మహిళల కబడ్డీ జట్టు


ప్రీ క్వార్టర్స్‌కు చేరిన జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలోని ఫతేమైదాన్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టు క్రీడాకారిణులు సత్తా చాటారు. ఈ నెల 7న పోటీలు ప్రారంభం కాగా ఆదివారం పోటీలు ముగిసేసరికి జిల్లా జట్టు ప్రీ క్వార్టర్స్‌కు చేరింది. పూల్ సీ లో ఉన్న జిల్లా జట్టు మేడ్చల్, ఆసిఫాబాద్ జట్లపై అద్భుత విజయాలను నమోదు చేసింది. జట్టు విజయం పట్ల జిల్లా కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్.సంపత్‌రావు, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌రావు, మల్లేశ్‌గౌడ్, కోచ్ పద్మ హర్షం వ్యక్తం చేశారు.

పోస్టుమార్టం కోసం మృతదేహం వెలికితీత

ముత్తారం(మంథని): ముత్తారం మండలం లక్కారంలో నవంబర్ 5న వేల్పుల కొమురమ్మ(75) చనిపోగా అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా తన తల్లిని ఇంటిపక్కన ఉండేవారు దూషించడంతో మనోవేదనకు గురై గుండెపోటుతో చనిపోయిందని మృతురాలి కొడుకు శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై నరేశ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆదివారం తహసీల్దార్ సుమన్ ఆధ్వర్యంలో కొమురమ్మ మృతదేహాన్ని సమాధి నుంచి వెలికితీయించగా, వైద్యుడు పోస్టుమార్టం చేశారు. శవపరీక్షల నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని, కేస్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థికి తీవ్రగాయాలు

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి తేలు మణిదీప్ ఆదివారం సాయంత్రం విద్యుత్‌షాక్ తగిలి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాలు.. తేలు రాజేశం-లక్ష్మి దంపతుల కుమారుడు మణిదీప్ తన స్నేహితులతో కలిసి సాయంత్రం షటిల్ ఆడేందుకు వెళ్లాడు. అందుకోసం విద్యుత్ లైట్లు అమర్చారు. విద్యుత్ సరఫరా కోసం పైనుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు తీగలు తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. తీవ్రగాయాలు కావటంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించినట్లు తెలిసింది.

ఆత్మస్థైర్యానికి ప్రతిబింబం జూడో

- కరీంనగర్‌లో సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు
- 27 నుంచి 30 వరకు నిర్వహణ
- 33 జిల్లాల నుంచి హాజరుకానున్న క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: చేతిలో ఎలాంటి ఆయుధం లేకున్నా ప్రత్యర్థుల దాడిని ఎదుర్కొంటూ, ఎదుటివారికి హాని కలగకుండా మట్టి కరిపించే యుద్ధ క్రీడ జూడో. పురాతన కాలంలోనే జూడో క్రీడకు క్రేజ్ ఉండేదని వినికిడి. ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యానికి ప్రతిబింబంగా నిలిచే జూడో క్రీడను అందరూ నేర్చుకోవాలంటున్నారు శిక్షకులు. కాగా ఈ నెల 27 నుంచి 30 వరకు కరీంనగర్‌లో సీఎం కప్- 2024 రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరగనున్నాయి. సీఎం కప్- 2024 పోటీల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రాష్ట్రస్థాయి పోటీలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) కేటాయించడం విశేషం.

2016లో జాతీయ పోటీలు

జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో 2016లో 62వ జాతీయస్థాయి పాఠశాలల అండర్-17 బాలబాలికల జూడో పోటీలకు జిల్లా ఆతిథ్యమిచ్చింది. అంతేకాకుండా సుమారు 20 సంవత్సరాలుగా ఏటా జూడో సంఘం ఆధ్వర్యంలో మానేరు పాఠశాలలో రాష్ట్ర జూడో పోటీలు జరగడం విశేషం. గతేడాది క్రీడా పాఠశాలలో అండర్-17 రాష్ట్ర పోటీలు, కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో జూనియర్స్ విభాగంలో, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో సబ్ జూనియర్స్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి.

33 జిల్లాల నుంచి..

తొలిసారిగా సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు కరీంనగర్‌లో జరగనుండగా 33 జిల్లాల నుంచి సుమారు 594 మంది క్రీడాకారులు, 132 మంది కోచ్లు, మేనేజర్లు, 20 మంది రెఫరీలు హాజరుకానున్నారు. 12 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల క్రీడాకారులకు జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. 2008 నుంచి 2012 మధ్య పుట్టిన వారు పోటీలకు అర్హులు.

నగదు బహుమతులు

సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు పారితోషికాలను ప్రభుత్వం ప్రకటించింది. బంగారు పతకానికి రూ.20 వేలు, రజత పతకానికి రూ.15 వేలు, కాంస్య పతకానికి రూ.10 వేలు ఇవ్వనున్నారు. కాగా జూనియర్స్ విభాగాల్లో 9 వెయిట్ కేటగిరీలో పోటీలు జరగనుండగా మొత్తం రూ.9 లక్షల 90 వేల నగదు బహుమతులు క్రీడాకారులకు దక్కనున్నాయి.

బాలుర వెయిట్ కేటగిరీలు
30,35,40,45,50,55,60,66 కేజీల లోపు, 66 కేజీల పైన..

బాలికల వెయిట్ కేటగిరీలు
36,40,44,48,52,57,63,70 కేజీల లోపు, 70 కేజీలపైన..

కరీంనగర్‌కు కేటాయించడం సంతోషకరం



తెలంగాణలో కరీంనగర్ జిల్లా జూడో క్రీడకు పెట్టింది పేరు. కేవలం మానేరు విద్యాసంస్థలకు జూడో క్రీడకు సుమారు 20 ఏళ్ల అనుబంధం ఉంది. ఇప్పటి వరకు 15కు పైగా రాష్ట్ర పోటీలు ఒక సారి జాతీయస్థాయి పోటీలను అట్టహాసంగా నిర్వహించాం. సీఎం కప్ పోటీలను సైతం ఘనంగా అందరం కలిసి నిర్వహిస్తాం.

– కదారి అనంతరెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు, మానేరు విద్యాసంస్థల అధినేత

అట్టహాసంగా నిర్వహిస్తాం



జూడో పోటీల్లో పాల్గొనేందుకు 33 జిల్లాల నుంచి రానున్న క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉన్ని ఏర్పాట్లు చేస్తాం. అట్టహాసంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. పోటీల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

పతకాలు సాధిస్తాం



జిల్లాలో జూడో క్రీడాకారులకు కొదువ లేదు. జాతీయస్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు ఉన్నారు. సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో సత్తాచాటి పతకాలు సాధిస్తారు.

– బి.సాయిరాంయాదవ్, క్రీడా పాఠశాల జూడో కోచ్, కరీంనగర్

అందరి సహకారంతో..



శాట్స్ అధికారులు కోరగానే జూడో క్రీడను కరీంనగర్‌కు కేటాయించడం సంతోషకరం. సీఎం కప్ పోటీలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో కలిసి విజయవంతం చేస్తాం.

– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి

ప్రమాద రహిత సింగరేణి లక్ష్యం

- నేటినుంచి బొగ్గు గనులపై రక్షణ పోటీలు

జీడీకే-7ఎల్‌ఈపీ గని ఇన్‌చార్జి మేనేజర్ ఇటీవల ఇసుక బంకర్‌లో పడి మృతిచెందారు. ఈ ప్రమాదం నివారించతగినదే. అయినా, తొందరపాటుతో నిండు ప్రాణం గాల్లో కలిసిందని అధికారులు వివరిస్తున్నారు.

జీడీకే-11గనిలో ఇటీవల ఎల్‌హెచ్‌డీ యంత్రాన్ని పార్క్ చేస్తుండగా.. దాని బకెట్ కిందకు జారిపడి ఆపరేటర్ మృతిచెందాడు. బకెట్‌ను కిందకు దింపిఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదంటున్నారు.

మందమర్రి వర్క్‌షాప్‌లో ఇటీవల ఐరన్ పట్టీలు క్రేన్‌తో వాహనంలో లోడ్ చేస్తుండగా రూఫ్‌వైర్ తెగిపడి కార్మికుడు మృతిచెందాడు. సరైన రూఫ్‌వైర్ వినియోగించినా, కార్మికుడు కొంతదూరంలో ఉన్నా ఈ ప్రమాదాన్ని నివారించే వీలుండని పేర్కొంటున్నారు.


ముస్తాబైన ఓసీపీ క్వారీలోకి వెళ్లే హాలేజీ ప్రధాన రోడ్డు

సింగరేణిలో గత ఏడేళ్లలో జరిగిన ప్రమాదాలు

ఏడాది	మృతులు	తీవ్ర గాయాలు	సాధారణ గాయాలు
2018	7	191	347
2019	8	138	217
2020	12	102	108
2021	13	122	107
2022	05	96	122
2023	05	68	70
2024	06	84	72

గోదావరిఖని(రామగుండం): ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దడం లక్ష్యంగా యాజమాన్యం సోమవారం నుంచి ఈనెల 21 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. సంస్థలో ఈఏడాది ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు ఉద్యోగులు మృతిచెందగా, గతేడాది జరిగిన ఐదు ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారు. ఇవన్నీ నివారించగలిగే ప్రమాదాలేనని, అవగాహన, రక్షణ చర్యలు, జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను అధిగమించవచ్చని, ఈక్రమంలోనే రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు రక్షణ చర్యలపైనా పూర్తిస్థాయిలో దృష్టి పెడుతోంది.

17 ఓసీపీలు.. 22 భూగర్భ గనులు

సింగరేణిలో 17 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు(ఓసీపీలు), 22 భూగర్భ గనులు ఉన్నాయి. వాటితోపాటు డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలపై పోటీలు నిర్వంచనున్నారు. ఇందుకోసం ఏర్పాటుచేసిన 12 ప్రత్యేక బృందాలు కార్పొరేట్, గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలను తనిఖీ చేస్తాయి. డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ ఆదేశాల మేరకు వారం నుంచి 15రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రతీ అంశంపై క్షుణ్ణంగా..

ప్రత్యేక బృందాలు రక్షణ ఓసీపీల్లో భారీ యంత్రాల కదలికలు, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, అగ్నిప్రమాదాలపై దృష్టి పెడతాయి. భూగర్భ గనుల్లో స్ట్రాటా కంట్రోల్ మేనేజ్‌మెంట్, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, రూఫ్, సైడ్ సపోర్టింగ్‌ను తనిఖీ చేస్తాయి. డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులు, సిబ్బంది కదలికలు, పనిముట్ల తీరు పరిశీలిస్తాయి. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన గనులను ఉత్తమంగా ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తాయి.

నిశితంగా తనిఖీ



ఓసీపీలు, భూగర్భ గనులు, వివిధ డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలను ప్రత్యేక బృందాలు నిశితంగా తనిఖీ చేస్తాయి. రక్షణపై దృష్టి సారించాకే బొగ్గు ఉత్పత్తి తీయాలి. ఈవిషయంపై ప్రత్యేక బృందాలతో అధ్యయనం చేస్తాం. – శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం